సాక్షి
విశాఖపట్నం
గురువారం : 7 : మార్చి : 2024



విమ్స్‌లో సూపర్ సేవలు

విమ్స్‌లో రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. 8లో



పారిశ్రామికవేత్తలకు సహకారం

ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ–డీఎఫ్‌వోలో బుధవారం ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. 8లో



యూత్ జోష్

ఆంధ్ర విశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ మైదానంలో బుధవారం నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ అందరినీ అలరించింది. 8లో

విశాఖ విజనరీ



5 ఇయర్స్.. రూ.1.05 లక్షల కోట్లు

- సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత
- అందుకే తప్పక కార్యరూపం దాలుస్తుందన్న నమ్మకం
- ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పైగా బడ్జెట్ ప్లాన్
- విశాఖ ఆర్థికంగా మరింత బలోపేతానికి దోహదం
- 'విజన్ విశాఖ' భేష్ అంటున్న మేధావులు, విద్యా, పారిశ్రామికవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: హామీలివ్వడం, వాగ్దానాలు చేయడం రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు పరిపాటి. వాటిని అమలు చేసే వారు అత్యంత అరుదుగా ఉంటారు. అలాంటి వారిపై ప్రజలు విశ్వాసాన్ని పెంచుకుంటారు. అంతటి విశ్వాసాన్ని సొంతం చేసుకున్న నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారు. విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచారు. అందుకే ఆయన ఏ హామీ ఇచ్చినా అమలు చేసి తీరుతారన్న గట్టి నమ్మకాన్ని జనంలో ప్రోది చేసుకున్నారు. ఇప్పటికే ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నవే కాదు.. కాలానుగుణంగా ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అనతికాలంలోనే ఆచరణలో చూపారు. మునుపు అధికారంలో ఉన్న చంద్రబాబుది నోటి మాటలు, ఓటి మాటలే తప్ప అమలు చేయరన్న పేరు గడించారు. **అందుకు భిన్నంగా జగన్ తీరు** ఉండడంతో ఆయన ఇచ్చే వాగ్దానాలపై సామాన్యులకు గాని, సంపన్నులకు గాని, వ్యాపారవేత్తలకు గాని, పారిశ్రామికవేత్తలకు గాని, వివిధ రంగాల నిపుణులకు గాని ఎలాంటి సంశయమూ కలగడం లేదు. తాజాగా 'విజన్ విశాఖ' పేరిట విశాఖ అభివృద్ధికి లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, అందుకు రూ.1.05 లక్షల కోట్లు వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించడం అభినందనీయం అంటూ వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. లక్ష్య సాధనకు ఐదేళ్ల సమయం నిర్దేశించుకోవడం, పదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు ధీటుగా విశాఖను తీర్చిదిద్దేలా నిర్ణయించడం ఆహ్వానించదగ్గ పరిణామం.. ఆచరణ సాధ్యం అంటూ విజన్ విశాఖ డాక్యుమెంటును స్వాగతిస్తున్నారు. అవి వారి మాటల్లోనే..

ముంబైకి దీటుగా విశాఖ



పశ్చిమ తీరంలో ముంబై ఎంతలా అభివృద్ధి చెందిందో.. తూర్పు తీరంలోని విశాఖ కూడా అదే రీతిలో వృద్ధికి అవకాశం ఉంది. ఆర్థిక రాజధానిగా, విద్య, వైద్య రంగాల్లో మహా నగరాలకు ధీటుగా ఉంది. చత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి వైద్యం కోసం ఇక్కడకే వస్తుంటారు. విదేశాల్లో అందే వైద్యం ఇక్కడ అందుతోంది. ఇప్పటికే ఆసియాలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరాల్లో విశాఖ ముందుంది. విజన్ విశాఖతో వైజాగ్ మరింతగా అభివృద్ధి చెందుతుందనడంలో సందేహం లేదు. అభివృద్ధిలో విశాఖకు ఉన్నంత సానుకూలతలు రాష్ట్రంలో మరే నగరానికి లేవు. విజన్ వైజాగ్ కల పదేళ్లలో సాకారం అవుతుంది.

– కె.శ్రీరామ్మూర్తి, రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఏయూ

సీఎంకు విశాఖపై స్పష్టమైన విజన్



విశాఖను అభివృద్ధి పథంలో ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై సీఎం వైఎస్ జగన్‌కు స్పష్టమైన విజన్ ఉంది. 'విజన్ విశాఖ' ఆలోచన చాలా మంచి నిర్ణయం. విశాఖ అభివృద్ధికి నిర్ణీత ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించడం హర్షించదగ్గ పరిణామం. దీంతో పెట్టుబడులకు రాచబాట ఏర్పడుతుంది. పారిశ్రామికంగా విశాఖ మరింత వృద్ధి చెందుతుంది. అన్నింటా కనెక్టివిటీ విస్తృతమవుతుంది. ఫలితంగా విశాఖతో పాటు ఈ ప్రాంతంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయి.

– జి.సాంబశివరావు, ఎండీ, శ్రావణ్ షిప్పింగ్స్, విశాఖపట్నం

సీఎం విజన్ క్రిస్టల్ క్లియర్



విశాఖ అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విజన్ క్లిస్టల్ క్లియర్‌గా ఉంది. ఆయన ఏదైనా హామీ ఇచ్చినా, నిర్ణయాన్ని ప్రకటించినా కచ్చితంగా అమలు చేసి తీరుతారన్న నమ్మకం అన్ని వర్గాల్లోనూ ఉంది. సీఎం ప్రకటించిన విజన్ విశాఖ డాక్యుమెంట్ చాలా మంచి నిర్ణయం. దీనిని మా సీఐఐ స్వాగతిస్తోంది. విజన్ విశాఖ డాక్యుమెంట్ కూడా తప్పకుండా కార్యరూపం దాలుస్తుంది. అందులో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు. 'విజన్ విశాఖ'తో నగరానికి అన్ని విధాలా కనెక్టివిటీ పెరుగుతుంది. విశాఖ మరింత శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.

– గ్రంధి రాజేష్, సీఐఐ విశాఖ జోన్ చైర్మన్

పొరుగు ప్రాంతాలూ అభివృద్ధి



విజన్ విశాఖ డాక్యుమెంట్ కార్యరూపం దాలుస్తుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే ఆచరణ సాధ్యం చేసే ముఖ్యమంత్రి ఉండడం, అభివృద్ధికి దోహదపడే ప్రకృతి, సహజసిద్ధ వనరులు విశాఖ సొంతం కావడం ఇందుకు దోహదం చేస్తుంది. ఇలాంటి అనుకూలతలు రాష్ట్రంలో మరే నగరానికి, ప్రాంతానికి లేవు. విజన్ విశాఖ డాక్యుమెంట్ ద్వారా విశాఖతో పాటు పొరుగున ఉన్న ప్రాంతాలూ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతాయి. లాజిస్టిక్స్, ఎగుమతులు పెరుగుతాయి. రాష్ట్రంలో అతిపెద్ద నగరం కావడం వల్ల వివిధ సంస్థల ప్రధాన కార్యాలయాలు ఇక్కడ ఏర్పాటవుతాయి. వైజాగ్ ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూర్చే 'విజన్ విశాఖ'ను స్వాగతిస్తున్నాం.

– పైడా కృష్ణప్రసాద్, ప్రెసిడెంట్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరేషన్

రాష్ట్రానికి విశాఖ గ్రోత్ ఇంజిన్



వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ దృఢచిత్తంతో ఉన్నారని విజన్ విశాఖ డాక్యుమెంట్ ప్రకటన ద్వారా మరోసారి రుజువైంది. విశాఖ నగరం రాష్ట్రానికి ఒక గ్రోత్ ఇంజిన్‌గా నిలుస్తోంది. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ ప్లాన్ రూపొందించడం ఆహ్వానించదగ్గ పరిణామం. విజన్ విశాఖ డాక్యుమెంట్‌పై వికేంద్రీకరణ జేఏసీ హర్షం వ్యక్తం చేస్తోంది.

– లజపతిరాయ్, వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్

సీఎం అంకితభావాన్ని ఊహించలేదు



వచ్చే ఎన్నికల్లో గెలిచాక విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తామని ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌కున్న అంకితభావాన్ని మేం ఊహించలేదు. మమ్మల్ని ఆశ్చర్యానికి గురి చేసింది. విశాఖపై మా అంచనాలకు మించి ఆయన విజన్ ఉంది. విజన్ విశాఖ డాక్యుమెంట్‌తో ఈ విషయం స్పష్టమైంది. విజన్ విశాఖ ద్వారా రోడ్డు, వాయు కనెక్టివిటీ మరింతగా పెరుగుతుంది. విజన్ డాక్యుమెంట్ అమలైతే వైజాగ్ ముంబైతో కచ్చితంగా పోటీ పడుతుందన్న నమ్మకం మాకుంది. విశాఖ ఐకానిక్ బిల్డింగ్ నిజంగానే ఐకానిక్‌గా మిగిలిపోతుంది.

– కంకటాల మల్లిక్, ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఏపీ భవిష్యత్తు విశాఖపైనే ఉంది..



రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి చెందగలిగే ఏకైక నగరం విశాఖే. విశాఖ అభివృద్ధి చెందితేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుంది. హైదరాబాద్‌కు వచ్చే ఆదాయంతో తెలంగాణ ఎలా అభివృద్ధి చెందిందో వైజాగ్ కూడా అంతే. భవిష్యత్తులోనూ సంపద సృష్టించే నగరం విశాఖే. ఏపీ భవిష్యత్తు విశాఖపైనే ఉంది. ఇక్కడ ఉన్నన్ని వనరులు రాష్ట్రంలో మరెక్కడా లేవు. వైజాగ్‌ను చూపించే రాష్ట్రంలో పెట్టుబడులు తెచ్చుకునే వీలుంది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకునే సీఎం వైఎస్ జగన్ 'విజన్ విశాఖ' డాక్యుమెంట్ ప్రకటన చేశారు. ఆయన ప్రకటనను విశాఖ వాసులుగా మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. ఆయన విజన్ కల సాకారం కావాలని ఆకాంక్షిస్తున్నాం.

– ఎస్ఎస్ శివశంకర్, అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర చైతన్య వేదిక

న్యూస్‌రీల్

'చేయూత'నిచ్చే ఆత్మీయ నేస్తం

- నేడు అనకాపల్లికి సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ చేయూత చివరి విడత నిధుల విడుదల



అనకాపల్లి మండలం పిసినికాడలో సిద్ధమవుతున్న సభా వేదిక

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయన గురువారం అనకాపల్లి మండలం పిసినికాడలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని వైఎస్సార్ చేయూత చివరి విడత నిధులను విడుదల చేయనున్నారు. సీఎం పర్యటనకు జిల్లా యంత్రాంగం, పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి ఉదయం 10.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కశింకోట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగుతారు. రోడ్డు మార్గాన 11.15 గంటలకు పిసినికాడ చేరుకొని బహిరంగ సభలో పాల్గొంటారు. 11.40 గంటల నుంచి సుమారు గంటసేపు ప్రసంగించిన అనంతరం బటన్ నొక్కి వైఎస్సార్ చేయూత చివరి విడత నిధుల పంపిణీని ప్రారంభిస్తారు. మహిళామార్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేస్తారు. 12.55 గంటలకు బయలుదేరి కశింకోటలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 1.05 నుంచి 2.05 గంటల వరకు ప్రజాప్రతినిధులతో ముచ్చటిస్తారు. అక్కడ 2.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.35 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగుపయనమవుతారు.

అందరి సహకారంతో వీఎంఆర్‌డీఏ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ చంద్రమౌళి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది సహకారంతో సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి పేర్కొన్నారు. నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనతో బుధవారం కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బందితో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం శాయశక్తుల పనిచేస్తానని, సీఎం సహకారంతో నూతన సిబ్బంది నియామకానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులు, సిబ్బంది సమయపాలన, అంకితభావంతో పని చేస్తూ సహాయ సహకారాలు అందిస్తే సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, చీఫ్ ఇంజినీర్ భవానిశంకర్, ముఖ్య ప్రణాళిక అధికారి సంజయ్ రత్నకుమార్, డీఎఫ్‌వో శాంతి స్వరూప్, ఎస్ఈ బలరామరాజు పాల్గొన్నారు.

నృసింహ మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కొట్టు

సింహాచలం: సింహగిరిపై ఈనెల 26 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరగనున్న శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞంకి సంబంధించిన పోస్టర్, ఆహ్వాన పత్రిక, టికెట్లను బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న మహా యజ్ఞంలో భక్తులంతా పాల్గొనాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఏఈఓ హరి, అర్చకులు పాల్గొన్నారు.

రేపు మాంసం దుకాణాలకు సెలవు

డాబాగార్డెన్స్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఈ నెల 8న జీవీఎంసీ పరిధిలో గల అన్ని మాంసం దుకాణాలకు సెలవు ప్రకటించినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినచో చట్టపరమైన చర్యలు తీసుకోవడమే గాక దుకాణాలు సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ మళ్లింపు

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి మండలం పిసినికాడలో సీఎం బహిరంగ సభ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు ఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు. భారీ వాహనాలు, కంటైనర్లు, టిప్పర్లు, లారీలు మొదలైన వాహనాలను దారి మళ్లిస్తున్నామని చెప్పారు. గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే ఆంక్షలు ఉంటాయన్నారు.

- విశాఖ నుంచి తుని వైపు జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలు లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని చేరుకోవాలి.
- తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు తుని, రేగుపాలెం జంక్షన్, యలమంచిలి బైపాస్, అచ్యుతాపురం, పరవాడ, లంకెలపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా విశాఖ చేరుకోవాలి.
- సబ్బవరం జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు అనకాపల్లి, లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి బైపాస్, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని వైపు వెళ్లవచ్చు
- చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి బ్రిడ్జి, మునగపాక, పూడిమడక రోడ్డు, అచ్యుతాపురం జంక్షన్, యలమంచిలి బైపాస్, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని చేరుకోవాలి.

మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

- బీచ్‌ల వద్ద భక్తుల కోసం సకల సౌకర్యాలు
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



అధికారులతో సమీక్షిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: ఈ నెల 8న మహాశివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి ఆయన శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శివరాత్రి రోజున నగర తీర ప్రాంతాల్లోని బీచ్‌ల్లో స్నానాలు చేసేందుకు రానున్న లక్షలాది మంది భక్తులకు భద్రతతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అప్పికొండ, కోస్టల్ బ్యాటరీ, ఆర్కే బీచ్, పెదజాలరిపేట, అప్పుఘర్, రుషికొండ, తెన్నేటి పార్క్, జోడిగుళ్లపాలెం తదితర బీచ్ ప్రాంతాల్లో భక్తులు ఇబ్బంది పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నగరంలో 77కు పైగా శివాలయాలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో అదనపు పారిశుధ్య కార్మికులతో నిరంతరం పరిశుభ్రపరచడంతోపాటు చలివేంద్రాలు, మజ్జిగ, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు విధుల్లో ఉండేలా చూడాలని సూచించారు. గత శివరాత్రి కన్నా మెరుగ్గా ఏర్పాట్లు, పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. బీచ్‌ల్లోని స్నానాల ఘాట్ల వద్ద బోట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచేందుకు జేడీ ఫిషరీస్‌కు లేఖ రాయాలని అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావుకు కమిషనర్ సాయికాంత్ వర్మ సూచించారు.

రూ.22.42 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

డాబాగార్డెన్స్: నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థాయీ సంఘంలో 68 అజెండాలతో పాటు 28 టేబుల్ అజెండాలతో కలిపి మొత్తం 96 అంశాలు పొందుపరిచారని, వీటిని స్థాయీ సంఘం సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారన్నారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి లీజుల పొడిగింపు, కాంట్రాక్ట్, ఆశీలు వసూలు, రూ.1.47 కోట్లతో ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు వార్డుల్లో తాత్కాలిక పద్ధతిపై అదనపు పారిశుధ్య కార్మికుల ఏర్పాటు, జేసీబీలతో వ్యర్థాల తొలగింపు, వెటర్నరీ విభాగానికి సంబంధించి మందుల కొనుగోలు, దోమల స్ప్రేయింగ్‌కు సిబ్బంది ఏర్పాటుకు ఆమోదం తెలిపారన్నారు. అలాగే ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.20.95 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు కార్యదర్శి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్లు శైలజావల్లీ, విజయలక్ష్మి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, పర్యవేక్షక ఇంజనీరు కేపీఎస్ రవి, కార్యనిర్వాహక ఇంజనీర్లు పాల్గొన్నారు.

భూ వివాదాలపై స్పెషల్ ఫోకస్

- ఒక్కో స్టేషన్‌లో ఒక్కో ఉన్నతాధికారి ఫిర్యాదుల స్వీకరణ
- 21 పోలీస్‌స్టేషన్లలో 191 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జాయింట్ సీపీ ఫకీరప్ప



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ-1 మణికంఠ

విశాఖ సిటీ: ఒకే స్థలాన్ని అనేక మందికి విక్రయించడం.. నకిలీ పత్రాలతో భూ ఆక్రమణలు చేయడం.. సరిహద్దు వివాదాలు.. తప్పుడు ఒప్పందాలు.. ఇలా అనేక రకాల భూ సంబంధిత ఫిర్యాదులు వెల్లువెత్తాయి. భూకబ్జాలు, నకిలీ పత్రాలు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్న వారి ఆటకట్టించడానికి నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 21 పోలీస్‌స్టేషన్లలో చేపట్టిన ఈ కార్యక్రమానికి మొత్తం 191 ఫిర్యాదులు వచ్చాయి.

భూ వివాదాల కారణంగా నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. ఇటీవల జరిగిన వరుస ఘటనలకు భూ తగాదాలు కారణమని పోలీసుల గుర్తించారు. దీంతో భూ వివాదాలకు చెక్ పెట్టడం ద్వారా బాధితులకు న్యాయం చేయడంతో పాటు నేరాలను నియంత్రించవచ్చని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ భావించారు. ఇందుకోసం కేవలం భూ వివాదాలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ సీపీ నుంచి ఏసీపీలు వరకు ఒక్కో ఉన్నతాధికారికి ఒక్కో స్టేషన్ బాధ్యతలు అప్పగించారు. వారితో బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాధితులతో స్వయంగా మాట్లాడి..

సీపీ ఆదేశాల మేరకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఉన్నతాధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. పీఎం పాలెం స్టేషన్‌లో జాయింట్ సీపీ ఫకీరప్ప, భీమిలిలో డీసీపీ–1 మణికంఠ, దువ్వాడలో డీసీపీ–2 సత్తిబాబు, ఆరిలోవలో డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం, ఇలా ఒక్కో స్టేషన్‌లో ఒక్కో ఉన్నతాధికారి ప్రతి ఫిర్యాదుదారుడితో స్వయంగా మాట్లాడారు. వారి సమస్యను తెలుసుకొని ఫిర్యాదు స్వీకరించారు. చట్టపరంగా వాటిపై చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా ఒకే స్థలాన్ని అనేక మందికి విక్రయించడం, నకిలీ పత్రాలతో భూములను ఆక్రమించడం, భూమి లీజులను పొడిగించకపోవడం, తప్పుడు ఒప్పందాలు, ప్రభుత్వ, ప్రైవేటు భూసేకరణలు ఇలా పలు అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి.

భూకబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు

ఈ ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టాలని సీపీ రవిశంకర్ ఆదేశాలు జారీ చేశారు. ఒకవైపు బాధితులకు న్యాయం చేయడంతో పాటు భూకబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు నగర బహిష్కరణకు సిఫార్సు చేయాలని నిర్ణయించారు. ఇటువంటి వారికి సహకరించే ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులు, ఇతర రిటైర్డ్ ఉద్యోగులపై కూడా చట్ట ప్రకారం, శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

నిజాయితీగా విధులు నిర్వర్తించండి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: నోడల్ అధికారులు నిజాయితీగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నోడల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించరాదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్(విశాఖ), డి.భాస్కరరెడ్డి(భీమిలి) పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటర్ పరీక్షలు

- పరీక్ష హాల్లోనూ సీసీ కెమెరాలు
- మాస్ కాపీయింగ్‌కు పూర్తిగా అడ్డుకట్ట



కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న అధికారులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఈ నెల 1న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా, ఇప్పటి వరకు జిల్లాలో ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని ఆర్ఐవో కార్యాలయం, ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి సైతం పర్యవేక్షణ చేస్తుండటంతో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలు పారదర్శకంగా జరుగుతున్నాయని అధికారులు అంటున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు అంటే అదో ప్రహసనంగా ఉండేది. కార్పొరేట్ కాలేజీల కుమ్మక్కుతో పెద్ద ఎత్తున మాస్ కాపీయింగ్, పేపరు లీకేజీ వదంతులు ఏదో ఒక చోట వినిపిస్తూనే ఉండేవి.

గతేడాది కంటే పెరిగిన విద్యార్థులు

2022–23లో విశాఖ జిల్లాలో 78 కేంద్రాల్లో మొదటి, రెండో సంవత్సరం కలిపి 75,242 మంది పరీక్షలు రాశారు. 2023–24లో జిల్లాలో 82,766 మంది పరీక్షలు రాస్తున్నారు. గతేడాది కంటే 7,524 మంది విద్యార్థులు ఎక్కువన్నమాట. గదుల్లో ఇష్టానుసారంగా విద్యార్థుల కేటాయింపు లేకుండా, బెంచ్‌కి ఇద్దరు మాత్రమే ఉండేలా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. అందుకనే ఈ ఏడాది జిల్లాలో 93 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి.

98 శాతం హాజరు

జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు జనరల్, ఒకేషనల్ కోర్సులకు కలిపి 44,382 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 43,545 మంది హాజరైనట్లు ఆర్ఐవో మురళీధర్ తెలిపారు. 837 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. 98 శాతం హాజరు నమోదైనట్లు ఆయన వెల్లడించారు.

రూ.37.13 లక్షల పెట్టుబడి రాయితీ జమ

కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, తదితరులు

మహారాణిపేట : జిల్లాలో గతేడాది డిసెంబర్ నెలలో సంభవించిన మిచాంగ్ తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని రైతుల ఖాతాల్లో బుధవారం జమ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ మల్లిఖార్జున పేర్కొన్నారు. 2023 సంవత్సరంలో వచ్చిన కరువు, మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో సంభవించిన అధిక వర్షాల వల్ల నష్టపోయిన వ్యవసాయ, ఉద్యానవన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమచేశారు. జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో కలెక్టర్ డాక్టర్ మల్లిఖార్జున, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి పాల్గొన్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలోని 4 మండలాల్లో గల 218.43 హెక్టార్లలో 826 మంది రైతులకు నష్టం వాటిల్లిందని కలెక్టర్ చెప్పారు. వారందరికీ రూ.37.13 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి జగన్ జమ చేసినట్లు చెప్పారు. అనంతరం నమూనా చెక్కును రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2019 సంవత్సరం ఖరీఫ్ నుంచి 2023 సంవత్సరం మిచాంగ్ తుఫాను వరకు మొత్తం 693.03 హెక్టర్లలో 3,369 మంది రైతులకు రూ.1.40 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని చెల్లించినట్లు చెప్పారు. విపత్తుల కారణంగా 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోయిన రైతులు... రాబోయే సీజన్‌లో పంటలు తీసుకోవడానికి లేదా దిగుబడి తగ్గింపును భర్తీ చేయడానికి అవసరమైన విత్తనం, ఎరువులు, పంట కొనుగోలు చేయడానికి సహాయం కోసం ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేస్తున్న సంగతిని కలెక్టర్ గుర్తు చేశారు.

ఎన్‌బీఏ గుర్తింపునకు కృషి



ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి

మద్రిపాలెం: నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు సాధించేలా కృషి చేయాలని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఎన్‌బీఏ బృందం కళాశాలను సందర్శిస్తుందని తెలిపారు. ఎన్‌బీఏ గుర్తింపు సాధించేలా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలన్నారు. ఆదిత్య బిర్లా గ్రూప్‌లో ఇటీవల ఉద్యోగాలు పొందిన నలుగురు విద్యార్థులకు ఈ సందర్భంగా ఆమె నియామక పత్రాలను అందజేసి, అభినందించారు. అనంతరం తరగతి గదులు, ప్రయోగ శాలలను పరిశీలించి సంతప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. సాంకేతిక విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ, డాక్టర్ బి.వి. లక్ష్మణరావు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన లైఫ్‌గార్డ్స్



మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీసులకు అప్పగిస్తున్న జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-4 పరిధి నోవాటెల్ సమీపంలోని తీరంలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ అడ్డుకుని ప్రాణాలు కాపాడారు. పరవాడ రాములవారి వీధికి చెందిన ఎం.రామలక్ష్మి కుటుంబ కలహాల కారణంగా బుధవారం ఉదయం 11.45 గంటలకు బీచ్‌కు చేరుకుంది. తన కుమారుడితో కలిసి నోవాటెల్ సమీప బీచ్ ప్రాంతంలో ఆత్మహత్యకు యత్నించింది. జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ టి.పోలిరాజు, ఎం.ధనరాజు ఇది గమనించి.. ఆమెను ప్రాణాలతో కాపాడారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి పోలీసులకు అప్పగించారు.



జోష్

ఫ్లాష్‌మాబ్‌లో డ్యాన్స్‌లు చేస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బాస్కెట్ బాల్ మైదానంలో బుధవారం నిర్వహించిన ఫ్లాష్ మాబ్ అందరినీ అలరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏయూ ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్ కోర్సులకు సంబంధించిన విద్యార్థులు ఉత్సాహంగా ఇందులో భాగస్వాములయ్యారు. ఏయూ యునైటెడ్ గర్ల్‌అప్ బృందాలు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయగా.. సినీ గీతాలకు అనుగుణంగా యువతీ యువకులు నృత్యాలు చేశారు. వేలాది మంది విద్యార్థులు ఫ్లాష్‌మాబ్‌ను వీక్షించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు ఆచార్య ఎ.పల్లవి, ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ సహకారం



ఎగ్జిబిషన్‌లో కొబ్బరిపీచుతో తయారు చేసిన బొమ్మల స్టాల్

అక్కిరెడ్డిపాలెం: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పారిశ్రామికవేత్తలు అందిపుచ్చుకోవాలని ఎంఎస్ఎంఈ-డీఎఫ్‌వో ఏడీసీ డి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ-డీఎఫ్‌వోలో బుధవారం ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ ముఖ్య అతిథిగా పాల్గొని ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోనే అతిపెద్ద రెండవ స్టీల్ ఉత్పత్తుల సంస్థ అని తెలిపారు. అమెరికా, యూరప్ దేశాలకు ఇక్కడ ఉత్పత్తి అయిన నాణ్యమైన స్టీల్‌ను 50 శాతం వరకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఏడీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళా పారిశ్రామిక వేత్తలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఉన్న అవకాశాలు, వారికి వర్తిస్తున్న రాయితీలను వివరించారు. ప్రొక్యూర్‌మెంట్ పాలసీని వివరించారు. ఎగ్జిబిషన్‌లో 40 వరకు స్టాళ్లు కొలువుదీరాయి.

పీఎం విశ్వకర్మను సద్వినియోగం చేసుకోండి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకాన్ని చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఏడీసీ డి.చంద్రశేఖర్, గాజువాక బీజేపీ కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు సూచించారు. 18 రకాల వృత్తుల వారికి ఉచితంగా శిక్షణ అందించి, అనంతరం వృత్తి పరికరాలు అందిస్తారన్నారు. ఎటువంటి గ్యారెంటీ లేకుండా మొదటగా రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు అందజేస్తున్నట్లు వివరించారు. పీఎం విశ్వకర్మ రిజిస్ట్రేషన్‌లో దేశంలో ఏపీ రెండవ స్థానంలో ఉందన్నారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ సీఎండీకి ఏడీసీ జ్ఞాపిక అందజేశారు. ఎంఎస్ఎండీ ఏడీ, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీను, హిందూస్థాన్ షిప్ యార్డు డైరెక్టర్ ఎస్.వి. రాంబాబు, కెనరా బ్యాంకు అధికారి మధుసూదన్ రెడ్డి, జి.వి.రమణ, ఐలా కమిషనర్ జయచంద్ర, చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, లఘు ఉద్యోగ్ భారత్ ప్రతినిధి ఎ.కె.బాలాజీ, ఏడీలు చంద్రమౌళి, ప్రభాకర్ కుమార్, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

సాగరతీరంలో కోటి లింగాలు



మహాశివరాత్రి పూజలకు సిద్ధమవుతున్న కోటి లింగాల సెట్

బీచ్‌రోడ్డు: మహా శివరాత్రికి సాగరతీరం సిద్ధమవుతోంది. ఆ రోజు వేలాదిగా భక్తులు స్నానాలు ఆచరించేందుకు తీరానికి తరలివస్తారు. ఈ సందర్భంగా బీచ్‌లో పూజలు చేస్తారు. ఈ మేరకు టి.సుబ్బరామిరెడ్డి కళాపీఠం ఆధ్వర్యంలో శివరాత్రి భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏటా లాగే ఈ ఏడాది కూడా సాగరతీరంలో కోటి లింగాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు కోటి లింగాలకు మహాఅభిషేకం జరగనుంది.

విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు

- గ్యాస్ట్రో ఎంటరాలజీ, బర్న్స్ విభాగాలను ప్రారంభించిన కలెక్టర్ మల్లికార్జున
- రూ.2 కోట్లతో అత్యాధునిక పరికరాల ఏర్పాటు



బర్న్స్ వార్డును ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఇక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో ఎంటరాలజీ, బర్న్స్ విభాగాలను బుధవారం విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) ప్రతినిధులతో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త విభాగాలు, అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విమ్స్‌లో మెరుగైన సేవలందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. సుమారు రూ.రెండు కోట్లతో అత్యాధునిక పరికరాలతో గ్యాస్ట్రో ఎంటరాలజీ, బర్న్స్ విభాగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో రూ.52 లక్షల సీఎస్సార్ నిధులతో ఐఓసీఎల్ సంస్థ పరికరాలు సమకూర్చడం అభినందనీయమన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు నిధులు ఖర్చు చేసి అత్యాధునిక పరికరాలు, పడకలు ఏర్పాటు చేసిందన్నారు. విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయని, ఉత్తరాంధ్ర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ బర్న్స్ వార్డులో 18 పడకలతో సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ 40 శాతం కంటే తక్కువ కాలిన వారికి చికిత్స అందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు. ఐఓసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్‌కుమార్, ప్రతినిధులు, విమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

ఉద్యోగినులకు సత్కారం



డీఆర్ఎం నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న స్టేషన్ మాస్టర్స్ గ్రూప్

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దొండపర్తిలో గల డివిజినల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏయూ కాలేజ్ ఆఫ్ లా ప్రొఫెసర్ కె.సీతా మాణిక్యం మాట్లాడుతూ లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో మహిళలకు స్వేచ్ఛ కల్పించాలని సూచించారు. రైల్వే భద్రతా దళం, కమర్షియల్, ఆపరేటింగ్, ఇంజినీరింగ్, మెడికల్ వంటి విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన 24 మందికి వ్యక్తిగతంగా, మరో 5 గ్రూపులకు డివిజినల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

నేడు మాక్ డ్రిల్

మహారాణిపేట : పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ గురువారం జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ జరగనుంది. జిల్లాలో ది ఆంధ్ర పెట్రో కెమికల్స్ లిమిటెడ్(నేవల్ డాక్‌యార్డు ఎదురుగా), కేం టెక్ ఆల్కోక్సైడ్ ప్రైవేటు లిమిటెడ్(దువ్వాడ)లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. అచ్యుతాపురం ఏపీసెజ్‌లో వసంత క్రెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలోను, లారెస్ సింథసిస్ ప్రైవేటు లిమిటెట్ (జేఎస్ ఫార్మాసిటీ, పరవాడ మండలం)లోను మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు.

'నారాయణ' పీఈటీ అఘాయిత్యంపై చర్యలకు డిమాండ్

స్కూల్ అనుమతులు రద్దు చేయాలని వినతి



ఏడీ విజయలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

విశాఖ విద్య : మధురవాడ నారాయణ స్కూల్‌లో ఓ విద్యార్థినిపై పీఈటీ జరిపిన అఘాయిత్యంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతం చేయాలని మానవ హక్కుల సంఘం, పేరెంట్స్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో కార్యాలయ అధికారులతో నారాయణ స్కూల్ వ్యవహారంపై చర్చించారు. డీఈవో అందుబాటులో లేకపోవటంతో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కో - కన్వీనర్ పుడిపెద్ది శర్మ మాట్లాడుతూ మధురవాడలోని నారాయణ స్కూల్ నిర్వహణపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. భద్రత ప్రమాణాలు లేని అపార్ట్‌మెంట్‌లో స్కూల్ నిర్వహణకు విద్యాశాఖాధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. పాఠశాలకు ఆట స్థలం లేనందున, వేరే ప్రాంతానికి విద్యార్థులను పీఈటీ తీసుకెళ్తున్నారని, దీనివల్ల విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తీరంలో యువకుడి మృతదేహం లభ్యం



తీరానికి కొట్టుకుని వచ్చిన గుర్తు తెలియని యువకుడి మృతదేహం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురం తీరానికి బుధవారం గుర్తుతెలియని ఓ యువకుడి మృతదేహం కొట్టుకొచ్చింది. అతని వయసు సుమారు 20 నుంచి 22 ఏళ్లు ఉంటుంది. సముద్రంలో స్నానానికి దిగి చనిపోయాడా? లేదా ఇతర కారణాలు వల్ల చనిపోయాడా? అనే విషయం తెలియాల్సి ఉంటుంది. ప్రస్తుతం భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ డి.రమేష్ తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఎస్‌పీడీ వద్ద రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: గోపాలపట్నం-ఎస్‌పీడీ మధ్య రైల్వేట్రాక్‌పై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. జీఆర్పీ తెలిపిన వివరాలివీ.. గోపాలపట్నం-ఎస్‌పీడీ మధ్య 873/5-7 ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి.. జీఆర్పీకి సమాచారం ఇచ్చారు. మరణించిన వ్యక్తి వయసు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. 5.4 అడుగుల ఎత్తు, తెలుపు రంగులో ఉన్నాడు. పసుపు రంగు టీ షర్ట్, బ్లాక్ కలర్ లోయర్ ధరించి ఉన్నాడు. అతని వద్ద ఏ విధమైన ఆధారాలు లభించలేదు. అతని ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. 94406 27547 /98664 13487లో సంప్రదించవచ్చు.

త్వరలో పట్టాలెక్కనున్న భువనేశ్వర్-విశాఖ వందేభారత్?

తాటిచెట్లపాలెం: ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 12వ తేదీన వర్చువల్‌గా మరో వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపనున్నట్లు సమాచారం. ఈ వందే భారత్ భువనేశ్వర్-విశాఖపట్నం- భువనేశ్వర్ మధ్య నడుస్తుందని తెలిసింది. ఈ రైలు వయా బరంపురం, విజయనగరం మీదుగా నడవనుంది. అయితే వాల్తేర్ డివిజన్‌కు మాత్రం ఇప్పటివరకు ఏ విధమైన అధికారిక సమాచారం లేదని ఇక్కడి అధికారులు తెలియజేశారు.

'నగరాలు'ను ఆదుకున్నది సీఎం జగనే

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- మధురవాడలో ఉత్సాహంగా ఆత్మీయ సభ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ: నగరాలు కులస్తుల సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఈ కులస్తులను అన్నివిధాలా సీఎం జగన్ ఆదుకున్నారని గుర్తు చేశారు. మధురవాడ సమీప బక్కన్నపాలెంలో నగరాలు ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు విజయవాడ మేయర్ రాయిన భాగ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల తర్వాత విశాఖ నుంచే పాలిస్తానని సీఎం జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా చెప్పారన్నారు. తద్వారా నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కులాల సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజకీయాలతో ముడిపెట్టవద్దని, ఎవరు మంచి చేస్తే వారికి అండగా నిలవాలని సూచించారు. నగరాలు సామాజిక వర్గానికి మధురవాడలో స్థలం మంజూరు చేయించడమే కాకుండా భవన నిర్మాణ బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు బీసీలకు పెద్దపీట వేశారన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తోనే 'నగరాలు' అభ్యున్నతి

విజయవాడ మేయర్ రాయిన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అడగకుండానే విజయవాడ నగర మేయర్, కనక దుర్గమ్మ గుడి చైర్మన్ వంటి పదవులు నగరాలు కులస్తులకు సీఎం జగన్ మోహన్ రెడ్డి కేటాయించారన్నారు. అలాగే విజయవాడ నడిబొడ్డున 1700 గజాలు స్థలంలో ఉన్న భవనాన్ని అడిగిన వెంటనే తమ సామాజికి వర్గం అభ్యున్నతికి కేటాయించారని కొనియాడారు. 'నగరాలు' కులస్తుల అభ్యున్నతి, అభివృద్ధికి కృషి చేసిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉండి, అన్ని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నగరాలును బీసీ జాబితాలో చేర్చడం వల్ల తమలాంటి వాళ్ల పిల్లలు ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదవగలుగుతున్నారన్నారు. ఆయనకు తామంతా రుణపడి వుంటామన్నారు. తమ సమస్యలు పరిష్కరించిన వారికి విశ్వాసంగా, అండగా ఉంటామని పలువురు నగరాలు కుల పెద్దలు పోతిన సుమన్ వెంకటరావు, బాయిన బాబ్జి, ఎన్‌వీ రమణ చెప్పారు. ఈ సందర్భంగా సామాజిక భవనం నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించాలని, నగరాలను బీసీ – ఏ జాబితాలో చేర్చాలని ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, రాయిన నరేంద్ర, పోతిన హనుమంతురావు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, జగ్గపిల్లి అప్పలరాజు, పోతిన మూర్తిబాబు, పిల్లా పాపారావు, పోతిన ఎల్లాజీ, నాగోతి నాగమణి, జీవీ రమణ, పోతిన ప్రసాద్, కురిటి లోహిత్, పోతిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, నిల్వల కోసం 1,084 గొడౌన్ల నిర్మాణం

రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజినీర్ మద్దినేని శ్రీనివాస్



మాట్లాడుతున్న చీఫ్ ఇంజినీర్ మద్దినేని శ్రీనివాస్

గోపాలపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా విత్తనాలు, ఇతర నిల్వల కోసం 1,084 గొడౌన్లు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజినీర్ మద్దినేని శ్రీనివాస్ తెలిపారు. గోపాలపట్నం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో బుధవారం అధికారులు, కాంట్రాక్టర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.40 లక్షలతో ఒక్కొక్క గొడౌన్ నిర్మిస్తున్నామని, ఇందులో 10 శాతం ప్రభుత్వం, 90 శాతం నాబార్డు నిధులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 622 గొడౌన్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలినవి స్థల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించి నిర్మాణాలు చేపడతామని వెల్లడించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గొడౌన్ల నిర్మాణాలు వెనుకంజలో ఉన్నాయన్నారు. సిబ్బంది కొరత అనే సాకుతో అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ డివిజన్‌లో 152 గొడౌన్లు నిర్మించాల్సి ఉండగా.. 42 మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. మిగిలినవి ఏప్రిల్, జూన్‌ల్లో పూర్తి చేస్తామన్నారు. నిర్లక్ష్యానికి గల కారణాలపై ఆరా తీస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.1.48 కోట్లతో రైతుబజార్ల అభివృద్ధి : నగరంలోని 13 రైతుబజార్లలో రూ1.48 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని మద్దినేని శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా ఆరిలోవలో రైతుబజార్ నిర్మించామని, చిట్టివలసలో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకాశ్, ఈఈ రవిప్రసాద్ పాల్గొన్నారు.

అగ్రికల్చర్ మార్కెటింగ్ ఈఈపై చర్యలు : అగ్రికల్చర్ మార్కెటింగ్ ఈఈ టి.రవిప్రసాద్‌పై చర్యలకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గొడౌన్ నిర్మాణంలో నిర్లక్ష్యం వహించినందుకు ఈ చర్యలు చేపట్టారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కోటయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు.